# సమిధలు

''కార్మిక సంఘం వర్ధిల్లాలి!''

''హక్కుల పోరాటం కొనసాగాలి!''

''నిరంకుశత్వం నశించాలి!''

దిక్కులు పిక్కటిల్లేట్టు అరుస్తూ కార్మిక జనప్రవాహం నడుస్తూంది. నాయకులూ, వినాయకులూ, కార్మికులూ, శ్రామికులూ అందరూ వున్నారు ఆ వూరేగింపులో. ప్రతివాడి ముఖంలోనూ ఒక ఆవేశం, - నరనరాల్లోనూ ఉద్రేకం - పొంగి పొరలుతూ వుంది.

ఆ ఊరేగింపుతో కలిసి నడుస్తున్న సుబ్బారావు బుర్రలో ఎన్నో ఆలోచనలు చెరుగుతున్నాయి.

సుబ్బారావు సాధారణంగా యిలాటి వాటి జోలికి పోడు - ఏదో తనపని తనది! ఎవరేమన్నా పట్టించుకొనే రకం కాదు! - ఉన్నంతలో సర్దుకుపోయే మనిషి.

అలాటి సగటు మనిషి కూడా యీ సమ్మెలో ఒకడయ్యాడంటే అందరికీ ఆశ్చర్యమే

దానికి కారణం ?

తనూ, ముగ్గురు పిల్లలూ, భార్యా, తల్లీ - వీళ్లను పోషించడానికే తన జీతం చాలడం లేదు!

చెప్పుకోడానికి ఏదో ఉద్యోగం చేస్తున్నాడన్నమాటే గాని - ఏడాది క్రిందటి వరకూ ఎలాగో బండి లాగాడు - కాని రోజులు గడుస్తున్న కొద్దీ కష్టం అయిపోతూంది ?

ఈ ఏడు సంక్రాంతికి బట్టలు ఎవరికీ కొనలేకపోయినాడు - తిండికే చాలకపోతే యింక సరదాలూ చట్టు బండలూ ఎక్కడ ? - ఎవరూ అప్పు యివ్వరు. బేంకు బాలెన్సు కలలో కూడా లేదు! - దొంగతనం, మోసం, చేయలేడు - లంచం లభించే ఉద్యోగం కాదు! ఆస్తిపాస్తులా లేవు... యింకెలా గడిచేది?

ఇలా తనొక్కడేనా ? ఎంతమంది తనలాగ బాధలు పడుతున్నారో! ఎన్ని కుటుంబాలు పస్తులుంటున్నారో!... యీ సమ్మె, తనొక్కడి కోసమేనా ? - కాదు. లక్షలాది కార్మికుల శ్రేయస్సు కోసం... తనొక్కడు సమ్మె చేయకుండా కూర్చుంటే మిగతా అందరూ చేస్తారు. వాళ్లు నెగ్గితే వాళ్లతోపాటు తనూ ఫలితం పొందుతాడు... అది ఎంత అన్యాయం ?

ఒకటి రెండుసార్లు జీతాలు పెంచేం, పెంచేం అని పదో, పాతికో పెంచుతారు గాని- ''జీతాలు పెంచుతున్నాం'' అని పేపర్లో పడగానే. ఒకసారి - ''ఇచ్చాం'' అని ప్రకటించేసరికి - రెండోసారి, చేతికి డబ్బు అందేక - మరోసారి - మార్కెట్లో ధరలు అంతకు రెండింతలు పెరిగిపోతాయి.

అలాగే కుండా

ఆ యిచ్చేదేదో ఋణమో - ధనమో - ప్రకటించిన వెంటనే యిచ్చేస్తే ఇన్నిసార్లు రేట్లు పెరగవు కదా. వ్యాపారస్థులకు ఆ సంగతి తెలయడమే తడవు ధరలు బిగించేస్తారు- ఆ యిచ్చేది ఉద్యోగస్తులకు అందినా, అందకపోయినా వారికక్కర్లేదు. కాని అలా నాలుగుసార్లు ప్రకటించి యివ్వకపోతే గాని యాజమాన్యానికి ప్రచారం రాదు. అందుచేత అది జరగదు.

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు జీతాలు ఎక్కువచేస్తే - రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు లేస్తారు - వారి తర్వాత చిన్న చిన్న ప్రైవేట్ కంపెనీల వారు లేస్తారు. యిలా వేతన చక్రం తిరుగుతూండ వలసిందే. పెద్ద చక్రం ఒకసారి తిరిగితే - - చిన్న చక్రం పదిసార్లు తిరిగినట్టు- వేతన చక్రం ఒకసారి తిరిగితే - ధరల చక్రం పదిరెట్లు తిరుగుతుంది!

అందువల్లే సుబ్బారావు ఎన్నోసార్లు వెనకా ముందూ ఆలోచించుగునే - యిందులో దిగేడు.

ఊరేగింపు వేదిక దగ్గరకు వెళ్లింది - నాయకులొక్కొక్కరూ బల్లగుద్ది - గొంతు చీల్చుకుని - మైకులు అదిరిపోయేట్టు ఉపన్యాసాలు అరిచేరు. సమావేశం పూర్తి అయింది. పెద్ద పెద్ద యూనియన్ నాయకులంతా నెలరోజుల నోటీసు యాజమాన్యానికి యిచ్చి - సమ్మె జరపడానికి ''అల్టిమేటమ్'' యిచ్చేశారు!

ఇలా జరగడం సాధారణమయినదే కాని - సుబ్బారావు సమ్మెలో పాల్గొనడం చాలా మందికి ఆశ్చర్యంతోపాటు - అతని గుండె ధైర్యం కూడా తెలిసింది. సుబ్బారావు యింత దమ్ము గలవాడా ? అని అనుకున్నారు - దాంతో వాళ్ల ఆఫీసులో యూనియన్ సెక్రటరీలూ, ప్రెసిడెంట్లూ, మెంబర్లూ, అందరూ అతనిని అభినందించి ఎత్తేసేరు.

''అరిచే వాళ్ల కన్నా - నీలా సమయానికి నిలబడే వాళ్లే.కార్మికులకి ఆదర్శప్రాయులని- ఏ పనయినా జరిగితే నీలాటి వాళ్ళ వల్లే జరగాలని - నీలాటి వాళ్లే ముందుకు నడవాలి'' అని ఉసికొల్పేరు!

ఆ క్షణం నుండి సుబ్బారావుని రోజూ మీటింగులకు తీసుకుపోయి నూరి పోశారు- అతనికి బ్రెయిన్ వాష్ చేశారు. యిక హరిబ్రహ్మాదులు వచ్చి వద్దని చెప్పినా వినే పరిస్థితిలో లేడు.

''నలుగురితోపాటు మనమూను - అందరూ సమ్మె చేస్తూంటే మీరు మాత్రం ఆఫీసుకు వెళతారా? అంత కన్నా ఆత్మవంచన వుందా ? వాళ్లు గెలిస్తే ఆ ఫలితాన్ని నాకూ కావాలని మీరూ తీసుకోరా ?'' అని అమాయకురాలయిన భార్య కూడా ప్రోత్సహించింది.

''ఎందుకే లేని పోని గొడవలు. ఎటొచ్చి ఏమవుతుందో ?'' అని అతని తల్లి మాత్రం వద్దన్నది.

ఆ రోజు - ఆ క్షణం రానే వచ్చింది!

''నడువ్ సుబ్రావ్! నీ చేతి మీదుగానే సమ్మె మొదలెడదాం... నువ్వే ముందడుగు వేయి... ఆఫీసుకు వెళ్ళకుండా దారి చూపు! బ్రేవో!''

''కార్మిక సంఘం వర్థిల్లాలి''

''హక్కుల పోరాటం సాగాలి''

''సుబ్బారావ్ హుర్రె హుర్రే!''

- అంటూ ముందుకు తోసారు - సుబ్బారావు ఆంజనేయుడయి పోయాడు!

ఆఫీసుకు ఎల్లవేళలా కరెక్టుగా పదీ అవకుండా అయిదు నిముషాలు ముందుగానే వచ్చే సుబ్బారావు ఆనాడు రాలేదంటే - ఆ సమ్మెకు అతనే నాంది పలికినట్టయింది. మరోలా చెప్పవలసి వస్తే అందరూ కలిసి అతని చేత పలికించేరు.

అది చూసి ఆఫీసర్లు అవాక్కయిపోయారు. ఎవరికీ నమ్మశక్యం కాలేదు. ఎంతో విధేయుడూ, అమాయకుడూ, శాంతిప్రియుడూ, అయిన సుబ్బారావు సమ్మె చేస్తున్నాడంటే అందరూ ఆశ్చర్యపోయేరు.

అంత కన్నా విడ్డూరం ఏమిటంటే -

బల్లలు గుద్ది, జబ్బలు చరిచి - గొంతులు చించుకున్న నాయకులను ఏమీ అనక - తాత్కాలికోద్రేకంలో - నిప్పులో దూకిన మిడతలాటి సుబ్బారావుని అరెస్టు చేసేరు! అప్పటి వరకూ ఊరూ పేరూ లేని సుబ్బారావు పేరు ఒక్కసారి మోత మ్రోగి పోయింది.

నాయకులు రెచ్చగొట్టగా - మిగిలిన కార్మికులు - ఆవేశంతో, ఊగిపోతూ ఆఫీసులో జొరబడి, కుర్చీలూ, రికార్డులూ, తదితర పరికరాలూ ధ్వంసం చేశారు. చేతికందిన వాటి నన్నిటినీ నాశనం చేశారు! పోలీసులు వచ్చి లాఠీ ఛార్జీ చేసి అదుపులోకి తెచ్చారు.

కార్మికు లందరూ సుబ్బారావ్‌కి జై! అంటుంటే అతను పోలీసుల వెంట సగర్వంగా నడిచి వెళ్లేడు. లోలోపల ఏమనుకున్నాడో గాని పైకి మాత్రం గంభీరంగానే వున్నాడు.

''నలుగురితోనూ నారాయణ'' అనుకుని ఉంటాడు.

ఇంట్లో యీ సంగతి తెలిసి అతని భార్య కొంచం గాభరా పడింది.

''ఇలాంటివి ప్రతి సమ్మెలోనూ జరిగేవే - తర్వాత ఏ గొడవా లేకుండానే విడుదల చేస్తారు! భయపడక్కర్లేదని'' తోటి కార్మికులు ధైర్యం చెప్పేరు.

అతని తల్లి మాత్రం కొడుకుని ఏం బాధలు పెడలారో అని వాపోయింది. ''చెపుతూ వుంటే విన్నాడు కాదని'' ఏడ్చింది. సుబ్బారావుని విడుదల చేసేక శాంతించింది.

తర్వాత రెండు మూడు రోజులు పాటు సమ్మె చాలా విజయవంతంగా నడిచింది. రాను రాను యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవడం ప్రారంభించింది.

ఆ మూడో రోజున పనిలోకి చేరకపోతే అలా చేరని వారిని ఉద్యోగం నుండి బర్తరఫ్ చేస్తారని - సస్పెండు చేస్తారని - బ్రేక్ ఆఫ్ సర్వీస్ చేస్తారని ప్రకటించడంతో సగం మంది పనిలోకి హాజరయిపోయారు!

మరో రెండు రోజులు పోయాక - '' పని చేస్తున్న విధేయులయిన కార్మికులకు స్పెషల్ ఇంక్రిమెంటులు యిస్తామని, ప్రమోషన్లు యిస్తామని, వారి పిల్లలకు ఉద్యోగాలిస్తామని ప్రకటించేసరికి మూడొంతుల మంది పనిలోకి వెళ్లిపోయేరు. !

సమ్మె చేస్తున్న కార్మికుల కుటుంబాలను యిళ్లల్లోంచి ఖాళీ చేయించడం మొదలెట్టేరు - ఆ కుటుంబాలకు నిలువ నీడ కూడా లేకపోవడం, వారు పడే యిబ్బందులను భరించలేక మిగతా

వారు కూడా సమ్మె విరమించి పనిలోకి వెళ్లడం ప్రారంభించారు.

ఈ విధంగా యాజమాన్యం సామ, దాన, బేధ, దండోపాయాలన్నీ ఉపయోగించి- ఆ సమ్మెను చట్ట విరుద్ధమని ప్రకటించి సమ్మె చేసిన నాయకులపై కఠిన చర్యలు తీసుకుందికి నిర్ణయించింది. సుబ్బారావును సస్పెండ్ చేశారు.

సమ్మెదారులతో సంబంధం పెట్టుకున్నా, చూడ్డానికి వెళ్ళినా కూడా చర్యలు తీసుకుంటాం అని బెదిరించేసరికి ఆ వచ్చే వాళ్లు కూడా రావడం మానుకున్నారు. సగం జీతంతో సుబ్బారావు జీవితం దుర్భరం అయింది. బెంగతో అధైర్యపడిపోయాడు.

మొదట్లో కార్మికులూ, సానుభూతిపరులూ కొన్నాళ్లు చందాలు వసూలు చేసి అతని కుటుంబాన్ని ఆదుకున్నారు. కాని. రానురాను ఆ సహాయం కూడా అందకుండా పోయింది. అందరూ తనకు అండగా నిలబడతారని ఆశించిన సుబ్బారావు హతాసుడయిపోయాడు.

తరువాత కేసు ఆరునెలలు పాటు జరిగింది. ఆఖరికి సుబ్బారావు మీద లేనిపోని ఛార్జీలన్నీ మోపి అతనినే సమ్మె నాయకుడిగా, హింసావాదిగా, అందరినీ ప్రేరేపించి, ప్రోత్సహించిన తిరుగుబాటు దారుడని- జరిగిన సమ్మెకు కారకుడు సుబ్బారావే అని నిర్ణయించి పనిలోనుండి డిశ్చార్జి చేస్తూ ఆరునెలలు జైలు శిక్ష విధించేరు!

ఆ రోజు తనను పుసికొలిపి ముందుకు త్రోసిన వారెవరూ యిప్పుడు కనబడలేదు. తనను పొగడ్తలతో ఆకాశానికెత్తి పూలదండలు వేసి వూరేగించిన సోదరులెవ్వరూ చేతులుకు సంకెళ్లు పడినపుడు... లేరు!

అమాయకంగా అందరి మాటలూ విని సమ్మె చేసిన సుబ్బారావుకి మిగిలింది చితికిపోయిన సంసారం! శూన్యమయిన భవిష్యత్తూ!

ఏ తప్పూ చేయకపోయినా ఏదో పెద్ద నేరం చేసిన వాడిలా జైలుకి నడిచాడు! .... కార్మికుల కామ్రేడ్ సుబ్బారావు!

సమ్మె అనే యజ్ఞంలో ఒక సమిధ అయిపోయాడు

★ ★ ★ -

మనవి : కార్మికులు చేసే సమ్మెలన్నీ యిలాగే అవుతాయని కాదు!
కార్మికులందరూ అలాటి వారనీ కాదు!
పర్యవసానాన్ని వూహించకుండా అవకాశవాదుల మాటలను విని,
నమ్మి, కష్టాల పాలయిన సుబ్బారావు లాటి వారికి హెచ్చరిక మాత్రమే.
అవుసరానికి వాడుకుని, అపాయం వచ్చినపుడు ఆదుకోని
మోసగాళ్ళు సర్వత్రా వుంటారని చెప్పడమే ఈ కథ లక్ష్యం.

★ ★ ★

(- అముద్రితం.)